# వీర మరణం

"అరె! ఏమైందిరా ఎంకా? అట్ట పరుగెత్తుకొచ్చాండవ్."
"అయ్యా!... అయ్యా....!"
"ఏం జరిగిందిరా? కాయా...? పండా?"
"పండేనయ్యా!... కాని..."
"అయ్. అద్దో, అట్టుండాల...పులుల్రా...మనోల్లు పెద్దపులులు...రా! ఇట్టా కూకో అరే!... సేతికేమైందిరా? - అంత లావుగా గుడ్డ సుట్టినవ్"
"యాటకొడేల్తో ఏసిన్రయ్యా"
"సంపలేకపొయ్యినవ్ - నాకొడుకుల్ను"
"మూడు తలకాయలు కోసినానయ్యా"
"అదీ... అట్టుండాల నా మనిసెంటే. యీరునివిరా నువ్వ ఎంకా! వైద్దెం సేయిచ్చానుండు... ఒరే సుబ్బన్నా.... ఒరేయ్! గవర్నమెంట్ డాకటర్ను పిల్సుకరారా"
"అబ్బా! ఎంత నెత్తురు... ఎన్ని శవాలు..."
"అసలు జరిగిందేందిరా! మిగతా మనోల్లంతా యాడుండ్రు?"
"వస్తాన్రయ్యా!"
"దొమ్మి అక్కడేనా జరిగింది?"
"కాదయ్యా సినిమాల్ దగ్గెర...మేము లారి నిండా, జీబు నిండా పొయ్యినం - బాంబులు, యాటకొడేల్లతో వాళ్లూ రెండు లారీలకు మంది వచ్చిన్రు".
"రొండు లారీలొచ్చిన్రా?.. అయితే..."
"దబదబ అటేపోల్లు, ఇటేపోల్లం బాంబులు సేదుకున్నెం. చుటూన్నె జనమంతా తప్పించుకొని పరిగెత్తిన్రు. యాటకొడేల్లతో బాంబుల్తో అక్కడ శానాసేపు దొమ్మిజేసినం."
"పడగొట్టిన్రా వాల్లను పదమందినన్నా?"
"మనోల్లో పదిమంది పడిపొయ్యిన్రయ్యా... వాల్లూ ఎనిమిది మంది సచ్చిన్రు"
"ఛ...ఛ...ఛ...ఎదవనాయల్లారా! మొగోల్లు సచ్చిన్రటరా?"
"మన సీమొగ్గ జయ్‌గాడు బాంబులు పట్టుకోని వాల్ల మందిలోకి దూకి నలుగుర్ని సంపిండు.... వాణ్నక్కడే వాల్లు నరికేసిన్రు...

"అబ్బ! ఎంత తెగువ! ఎంత పౌర్సం! యీరుడంటే వాడేరా... వానికి యీరసోర్గం వాకిండ్లు తెరిసే వుంటాయి. యీరుడెప్పుడూ నరకానికి పోడురా. సావంటే వాన్దేరా! ఆహా...ఏమి సావు? యీర మరణం...యీరమరణం"

"అంతలో మన సినబాబు జీపేసుకొని ఆడి కొచ్చిందయ్యా?....

"యాందీ? సినబాబా?... సినబాబు ఆడకొచ్చిండా?... మా సినబాబా?"

"ఆ..."

"వానికేం పనుందంట అక్కడ? వానికింకా పిల్లకాయ బుద్దులు పోలే"

"సినబాబు సేతిలో తుపాకితో వొచ్చిండు"

"తుపాకితోనా? అయితే తెలిసే కావాల్సే వొచ్చిండన్న మాట"

"అవతల మద్దిగాన్ని, ఎల్లుగాన్ని పిట్టల్ను కాల్చినట్టు కాల్సిండు"

"సినబాబుకు దెబ్బలేమీ తగల్లేదు గదా?"

"సినబాబు ఉశారు సూసి మేం గూడా ముందుకు దూకినం. బాంబులేసినం, కత్తులు విసిర్నాం."

"సినబాబుకు గాయాలేం కాలేదుగదా?"

"సోమిగాడు యాట కొడేల్తో వచ్చి సినబాబును నరకబొయ్యిండు..."

"తగిలిందా కొడేలి?"

"నే నడ్డ పడినా! నా సెయ్యి తెగింది. సినబాబు వాన్ని కాల్చి పారేసిండు"

"అంటే.. సినబాబు సుట్టూ ఆ పక్క మాసులు సుట్టుకున్నెట్టే గదూ? ఒరే ఒరే.. మీరంతా ఏమైన్రురా? సచ్చిన్రా..."

"దొమ్మి బోగోరంగ జరిగిందయ్యా! వాల్లంతా సచ్చిన్రు. వాల్లతోబాటే మనపక్క ఒక గొప్ప యీరుడు కూడా..."

"ఎవరు? ఎవుర్రా ఆ వీరుడు?"

"ఆయన కాయంగా సార్గానికే పోతాడయ్యా! యీర సొర్గం! యీరమరనం పొందినోనికి యీరసార్గమే గదంటయ్యా వొచ్చేది... ఆయన యీరసార్గానికి పోతాడు. మనమంతా ఆయన కోసం యాడ్సగూడదయ్యా"

"ఎవుర్రా ఆయన?"

"సినబాబయ్యా!"

"రేయ్ నా కొడకల్లారా! ఎంతపన్జేసిన్రురా? ఇంత కాలం నా ఉప్పుదిని, నా బిడ్డను కాయలేక పొయ్యినారుగదా? రేయ్... నిన్ను...నిన్ను బతకనియ్యను. నిన్ను కాల్సిపారేయాల్రోయ్...!".

◆ ***ఆంధ్రజ్యోతి వీక్లీ - 20.4.1990*** ◆